# హీరోయిన్ల ఫోన్లు హ్యాక్ చేయిస్తున్న రేవంత్: కౌశిక్



**కరీంనగర్:** "సినీరంగ ప్రముఖులు, హీరోయిన్ల ఫోన్లను హ్యాక్ చేయిస్తూ వారిపై సీఎం రేవంత్‌రెడ్డి దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. రేవంత్‌రెడ్డి చరిత్ర నాకు పూర్తిగా తెలుసు." అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఫోన్లు ట్యాపింగ్ చేశారని తప్పుడు ప్రచారం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. తానే ఫోన్లు ట్యాపింగ్ చేయిస్తున్నానని, తప్పు ఒప్పుకొన్నారని పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా.. అధికారులతో ఫోన్లు ట్యాప్ చేయిస్తున్నా.. తప్పేంటని సీఎం ప్రశ్నించారని గుర్తుచేశారు. తనఫోన్‌తో పాటు తన సతీమణి ఫోన్ కూడా సీఎం హ్యాక్ చేయిస్తున్నారని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు.

TGTEL/25/A0977

# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

# టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టండి

**తెలంగాణలో అపార అవకాశాలు**

**తైవాన్ పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం**

**ఈ-గవర్నెన్స్‌లో ఎస్తోనియా సహకారం తీసుకుంటామని వెల్లడి**

**హైదరాబాద్, జూలై 25:** టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో అపారమైన అవకాశాలున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టి 'రైజింగ్ తెలంగాణ'లో భాగస్వామ్యం కావాలని తైవాన్ పారిశ్రామికవేత్తలను కోరారు. శుక్రవారం సచివాలయంలో తైవాన్ టెక్స్‌టైల్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్) అధ్యక్షుడు జస్టిన్ వాంగ్ నేతృత్వంలో 11 మంది ప్రతినిధుల బృందం మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "స్వల్ప కాలంలోనే టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు దీటుగా ఎదిగింది. రాష్ట్ర పారిశ్రామిక జీఎస్‌వీఏ (రాష్ట్ర స్థూల విలువ జోడింపు) 2024–25లో రూ.2.77 లక్షల కోట్లుగా ఉంది. ఇందులో టెక్స్‌టైల్ రంగం కీలక పాత్ర పోషించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో అభివృద్ధి చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ) గేమ్ చేంజర్‌గా మారింది.

సంపుటి : 1 | సంచిక : 349 | మంగళవారం 26-07-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.

# బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలి!

**కేంద్ర మంత్రి జోషికి ఆర్ కృష్ణయ్య వినతి**



**రాంనగర్, జూలై 25:** ప్రస్తుత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే బీసీ బిల్లును ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి వినతి పత్రం అందజేశారు. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరారు. విద్య, ఉద్యోగాలలో బీసీలకు అవకాశాలు కల్పించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు జరిగేలా చూడాలని కేంద్ర మంత్రిని కోరినట్లు ఆర్ కృష్ణయ్య తెలిపారు.

# రాజ్యసభ సభ్యునిగా కమల్‌హాసన్ ప్రమాణం

**చెన్నై, జూలై25**

తమిళనాడు నుంచి రాజ్యసభకు ఎంపికైన 'మక్కల్ నీదిమయ్యం' అధినేత, ప్రముఖ సినీ నటుడు కమల్ హాసన్ సహా ఆరుగురు శుక్రవారం పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేశారు. డీఎంకేకు చెందిన రాజ్యసభ సభ్యులు పి.విల్సన్, షణ్ముగం, అబ్దుల్లా, అన్నాడీఎంకేకు చెందిన చంద్రశేఖరన్, ఎండీఎంకే నేత వైగో, పీఎంకే సభ్యుడు అన్బుమణి పదవీకాలం గురువారంతో ముగిసింది. వీరి స్థానంలో తమిళనాడు నుంచి డీఎంకే మద్దతుతో ఎంపికైన కమల్‌హాసన్, ఆ పార్టీకి చెందిన సీనియర్ న్యాయవాది విల్సన్, కవయిత్రి సల్మా, ఎస్ఆర్ శివలింగం, అన్నాడీఎంకే తరఫున ఎంపికైన ఇన్బదురై, ధనపాల్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. వీరంతా తమిళంలోనే ప్రమాణం చేశారు. 2018లో కమల్ 'మక్కల్ నీదిమయ్యం' పార్టీ స్థాపించారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆపార్టీ ఘోరపరాజయం పాలైంది. అయితే 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కమల్ పార్టీ డీఎంకే కూటమికి మద్దతు పలికింది. ఆ ఎన్నికల్లో ఎలాంటి స్థానం కేటాయించని డీఎంకే అధినేత స్టాలిన్.. భవిష్యత్తులో కమల్‌ను రాజ్యసభకు పంపుతామని హామీనిచ్చారు. ఆ మేరకు ఇప్పుడు కమల్ డీఎంకే మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నికై రాజ్యసభలోకి అడుగు పెట్టారు.

# మేం అధికారంలో ఉన్నప్పుడే కులగణన చేయాల్సింది



**అవకాశాల్లో న్యాయమైన వాటా ఇవ్వాల్సింది**

**రెట్టింపు వేగంతో పనిచేసి ఆ తప్పు దిద్దుకుంటా**

**తెలంగాణ కులగణన.. దేశ రాజకీయాల్లో కుదుపు**

**విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో దీంతో పెను మార్పు**

**రిజర్వేషన్లలో 50 శాతం అడ్డుగోడను కూల్చేశారు**

**ప్రైవేట్ విద్యలోనూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కోటా**

**మోదీదంతా ప్రదర్శనే.. ఆయనలో సరుకేమీ లేదు**

**కాంగ్రెస్ భాగీదారీ న్యాయ సమ్మేళనంలో రాహుల్**

**న్యూఢిల్లీ, జూలై 25:** తెలంగాణ కుల గణన దేశ రాజకీయాలను కుదిపేసేంత కీలకమైనదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇప్పుడు దేశమంతా తెలంగాణ నమూనా గురించే చర్చిస్తోందన్నారు. కుల గణన తర్వాత రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో పెనుమార్పులు వస్తాయని అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో కాంగ్రెస్ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన భాగీదారీ న్యాయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగంలో రాహుల్‌గాంధీ తాను ఓబీసీ వర్గాలను అర్థం చేసుకోవడం ఆలస్యమైందని అంగీకరించారు. తప్పు చేశానని, 15 ఏళ్ల క్రితమే అధికారంలో ఉండగా కులగణన చేసి ఉండాల్సిందని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. 2004 నుంచి 21 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, వెనక్కి తిరిగి చూసుకుంటే తాను, కాంగ్రెస్ పార్టీ ఒక తప్పు చేశామని చెప్పారు. ఓబీసీ వర్గాన్ని రక్షించే విషయంలో వెనుకబడ్డానని అంగీకరించారు. ఓబీసీల సమస్యలను లోతుగా అవగాహన చేసుకోలేక పోయానన్నారు. 15 ఏళ్లకు ముందు దళితులు, ఆదివాసీల సమస్యలను అర్థం చేసుకోగలిగానని, వారి మీదే పూర్తిగా దృష్టి కేంద్రీకరించానని చెప్పారు. అది కాంగ్రెస్ తప్పు కాదని, మార్గదర్శక పాత్రలో ఉన్న తనదే కచ్చితంగా తప్పు అవుతుందని చెప్పారు. ఆ సమయంలోనే కులగణన చేయించి ఉంటే ఫలితం వేరేగా ఉండేదని అన్నారు. ఇప్పుడు తాను చేయాలని చూస్తున్నది 15 ఏళ్ల క్రితమే సాకారమయ్యేదని చెప్పారు. అప్పుడు చేయలేక పోయినందుకు ఇప్పుడు రెట్టింపు వేగంతో చేయబోతున్నానని ప్రకటించారు. తెలంగాణ కులగణన గురించి ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో ఉన్న డేటాకు దేశంలో ఎక్కడాఎదురు లేదని చెప్పారు. ఈ డేటాతో రాష్ట్రంలో కార్పొరేట్ సంస్థల్లో ఎంత మంది ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు ఉన్నారో నిమిషంలో తెలుస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థల యజమానుల్లో ఎంతమంది ఓబీసీలు, దళితులు ఉన్నారో కూడా కులగణన డేటా చెప్పగలదని ప్రకటించారు. ఈ వర్గాల్లో లక్షలు, కోట్ల రూపాయల ప్యాకేజీలు ఎంత మందికి లభిస్తున్నాయని అడిగితే జీరో అనే సమాధానమే వస్తుందని చెప్పారు. దేశంలో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు నేటికీ కూలీలుగానే జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 2లో...

# సీఎం రమేశ్‌కు 1600 కోట్ల కాంట్రాక్టు..!

**రాష్ట్రాన్ని దోచుకుంటున్న రేవంత్‌రెడ్డిని మోదీ ప్రభుత్వం కాపాడుతోంది: కేటీఆర్**



**హైదరాబాద్, జూలై 25:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకం విషయంలో రేవంత్‌రెడ్డికి మద్దతిచ్చి.. కమీషన్లు ఇప్పించిన బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు క్విడ్‌ప్రోకో కింద రాష్ట్ర ముఖ్యమంత్రి వందల కోట్ల కాంట్రాక్టు కట్టబెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్రీయ విద్యార్థి సేన పరిషత్ (టీఆర్‌వీఎస్‌పీ)ను బీఆర్ఎస్ విద్యార్థి విభాగంలో విలీనం చేసిన సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మాట్లాడారు. బీజేపీ ఎంపీకి రాష్ట్ర ముఖ్యమంత్రి ఫోర్త్‌సిటీలో రూ.1600 కోట్ల విలువైన రోడ్డు కాంట్రాక్టులిస్తుంటే.. రాహుల్‌గాంధీ కళ్లు మూసుకున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుంటున్న రేవంత్‌రెడ్డిని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాపాడుతోందని ఆరోపించారు. రేవంత్ సర్కార్ అక్రమాలు, అవినీతిని నిరూపించే సాక్ష్యాలను కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల రాజకీయ అక్రమ సంబంధం నిస్సిగ్గుగా నడుస్తోందని వ్యాఖ్యానించారు.

# గురుకుల హాస్టల్‌లో ఎలుకల కలకలం

**ఇద్దరు విద్యార్థులకు గాయాలు**



**హుజూరాబాద్, జూలై 25:**

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని సైదాపూర్ బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థులను ఎలుకలు కొరికాయి. దీంతో ఆ ఇద్దరితో పాటు గదిలో ఉన్న 10మంది విద్యార్థులను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి టీటీ ఇంజక్షన్లు ఇప్పించారు. హాస్టల్‌కు సమీపంలో రైస్ మిల్లులు ఉండడంతో ఎలుకలు వస్తున్నాయని, బోన్లు ఏర్పాటు చేస్తున్నామని ప్రిన్సిపాల్ రాణి తెలిపారు. విద్యార్థులు క్షేమంగా ఉన్నారని చెప్పారు.

# ఉద్యోగాల కల్పనకు కేంద్రం ప్రోత్సాహకాలు

**పీఎంవీబీఆర్‌వై ఆవిష్కారం.. ఆగస్టు 1 నుంచి అమల్లోకి**



**న్యూఢిల్లీ, జూలై 25:** కొత్తగా ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించేందుకు కేంద్రం నూతన పథకాన్ని ఆవిష్కరించింది. పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై) పేరుతో ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహక పథకాన్ని ప్రారంభించినట్టు శుక్రవారం కార్మిక శాఖ తెలిపింది. ఈ పథకం ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానుందని, వచ్చే రెండేళ్లలో 3.5 కోట్లకు ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంతో ఈ పథకానికి రూ.99,446 కోట్లు కేటాయించినట్టు తెలిపింది. ఇందులో 1.92 కోట్ల మంది మొదటిసారిగా ఉద్యోగం పొందిన వారు ఉండాలని ఆశయంగా పెట్టుకొంది. 2025 ఆగస్టు ఒకటో తేదీ నుంచి 2027 జూలై 31లోగా ఈ ఉద్యోగాలను కల్పించాల్సి ఉంటుంది. కొత్తగా ఉద్యోగాలు పొందినవారితోపాటు ఉద్యోగాలు కల్పించిన యజమానులకూ ప్రోత్సాహకాలు అందించనుండడం ఈ పథకం ప్రత్యేకత. వస్తువుల తయారీ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ పథకం పార్ట్–ఏలో తొలిసారిగా ఉద్యోగాలు పొందిన వారికి, పార్ట్–బిలో యజమానులకు అందించే ప్రోత్సాహకాలను ప్రస్తావించారు. తొలిసారిగా ఉద్యోగాలు పొందిన వారు ఈపీఎఫవోలో పేరు నమోదు చేసుకొని ఉంటే వారికి ఒక నెల ఈపీఎఫ్ వేతనాన్ని ప్రోత్సాహకంగా ఇస్తారు. ఇది గరిష్ఠంగా రూ.15,000 వరకు ఉంటుంది. రూ.లక్ష వరకు వేతనం పొందే వారూ ఈ ప్రోత్సాహకం పొందేందుకు అర్హులే. ఆరు నెలల సర్వీసు పూర్తయిన తర్వాత తొలి విడత ప్రోత్సాహకం లభిస్తుంది. 12 నెలలు ఉద్యోగం చేసి, యాజమాని నిర్వహించే 'ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమా'న్ని పూర్తి చేసిన తర్వాత రెండో విడత ప్రోత్సాహకం చెల్లిస్తారు. దీన్ని ఫిక్సిడ్ డిపాజిట్ రూపంలోగానీ, సేవింగ్స్ పత్రాల రూపంలోగానీ కొంతకాలంపాటు డిపాజిట్ చేయాలి. కొత్తగా సృష్టించే ఉద్యోగాలకే ఈ ప్రోత్సాహకం లభిస్తుంది. పార్ట్–బి ప్రకారం అదనంగా కల్పించే ప్రతి ఉద్యోగానికి ప్రోత్సాహకం కింద యజమానికి ప్రతినెలా రూ.3,000 చొప్పున రెండేళ్లు ఇస్తారు. తయారీ రంగ యజమానులకైతే మూడు, నాలుగేళ్లపాటు కూడా ఈ ప్రయోజనం కల్పిస్తారు.

# జస్టిస్ వర్మ అభిశంసన లోక్‌సభలోనే!

**నోటీసును రాజ్యసభ అనుమతించలేదట!**

**అధికార వర్గాల పేరుతో ప్రభుత్వం వెల్లడి**

**లోక్‌సభ సభ్యులతోనే విచారణ కమిటీ**

**అభిశంసన అన్ని పార్టీల నిర్ణయం: రిజిజు**

**ధన్‌ఖడ్‌కు వీడ్కోలు విందు యోచనలో విపక్షం.. ఆయన హాజరు అనుమానమే**

**ఆగస్టులోగా కొత్త ఉప రాష్ట్రపతి: ఈసీ**



**న్యూఢిల్లీ, జూలై 25:** జస్టిస్ యశ్వంత్ వర్మను హైకోర్టు జడ్జి పదవి నుంచి తప్పించేందుకు ఉద్దేశించిన అభిశంసన తీర్మానాన్ని లోక్‌సభలోనే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ తీర్మానం కోసం లోక్‌సభలో బీజేపీ, రాజ్యసభలో కాంగ్రెస్ నోటీసు ఇచ్చాయి. కాంగ్రెస్ ఇచ్చిన నోటీసును అనుసరించి అభిశంసన తీర్మానాన్ని చేపట్టాలని నిర్ణయం తీసుకొని అధికార పార్టీ ఆగ్రహానికి గురైన రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ అదేరోజు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన పదవి నుంచి తప్పుకోవడంతో కొత్త ఉప రాష్ట్రపతి వచ్చేవరకు రాజ్యసభ నిర్వహణ బాధ్యత రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో ఆయన కార్యాలయం కాంగ్రెస్ ఇచ్చిన నోటీసును రాజ్యసభ అనుమతించలేదని రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో ఆయన కార్యాలయం కాంగ్రెస్ ఇచ్చిన నోటీసును రాజ్యసభ అనుమతించలేదని చెబుతోంది. దాంతో బీజేపీ కోరుకున్నట్లు లోక్‌సభలో బీజేపీ ఆధ్వర్యంలో జస్టిస్ వర్మ అభిశంసన కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం లభించింది. 21వ తేదీన లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఒకేసారి అభిశంసన తీర్మానం నోటీసులను అందుకున్న నేపథ్యంలో చట్టం ప్రకారం ఇరు సభల సభ్యులతో కలిపి విచారణ కమిటీ వేయాల్సి ఉంటుందని జగదీప్ ధన్‌ఖడ్ అదేరోజు ప్రకటించారు. అయితే, ఇప్పుడు రాజ్యసభలో నోటీసే లేనందున రెండు సభల్లో కలిపి విచారణ కమిటీ వేయడం ఉండదని భావిస్తున్నారు. ఇప్పుడు లోక్‌సభలో చేపట్టాలని నిర్ణయించడంతో అన్నీ లోక్‌సభ ద్వారా జరగనున్నాయి. రాజ్యసభలో అభిశంసన తీర్మానాన్ని చేపట్టాలన్న ఉద్దేశాన్ని జగదీప్ ధన్‌ఖడ్ వ్యక్తపరచి ఉంటే రాజ్యసభలో బీజేపీ ఎంపీలే చొరవ తీసుకొని సంతకాలు పెట్టించే వారని, ఈ అవకాశాన్ని కాంగ్రెస్ చేతుల్లో పెట్టడంపైనే తమ అభ్యంతరమని బీజేపీ వర్గాలు తెలిపాయి. జస్టిస్ వర్మను ఇంటికి పంపాలన్నది అన్ని పార్టీలు తీసుకున్న నిర్ణయమని, లోక్‌సభ నోటీసును బీజేపీ చేపట్టినప్పటికీ అన్ని పార్టీల వారు సంతకాలు చేశారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

# పొన్నం లేదా మహేశ్‌గౌడ్‌ను సీఎం చేయాలి!

**బీసీలపై రేవంత్‌కున్న ప్రేమను చాటుకోవాలి**

**దత్తాత్రేయను ఉపరాష్ట్రపతి చేయాలన్న ముఖ్యమంత్రి డిమాండ్ సంతోషకరం**

**రేవంత్ తన విమర్శలతో మోదీనే కాదు బీసీలనూ అవమానించారు**

**బండి, ఈటల వివాదం సమసిపోతుంది**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ముందు మీ నాయకుడిది ఏ కులమో చెప్పు!**



**హైదరాబాద్, జూలై 25:** బీజేపీ సీనియర్ నేత, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేయడం సంతోషకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. అదేసమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ లేదా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ముఖ్యమంత్రిని చేసి.. బీసీల పట్ల తనకున్న ప్రేమను రేవంత్ చాటుకోవాలని సూచించారు. రేవంత్‌రెడ్డికి 'ఆస్కార్' కాదు.. 'భాస్కర్ ' అవార్డు ఇవ్వాలని వ్యంగ్యంగా అన్నారు. ప్రధాని మోదీ కన్వర్టెడ్ బీసీ అంటూ ప్రచారం చేస్తున్నందుకు ఆయనకు గోబెల్స్ బహుమతి ఇవ్వాలని పేర్కొన్నారు. దీనిపై తాము సోనియాకు లేఖ రాస్తామని తెలిపారు. రేవంత్ తన విమర్శల ద్వారా మోదీనే కాదని, బీసీలందరినీ అవమానించారని ధ్వజమెత్తారు. బీజేపీని బీసీలకు దూరం చేసేందుకు కుట్ర జరుగుతోందని రాంచందర్‌రావు అన్నారు. తాను కూడా బీసీ (బ్రాహ్మణ కమ్యూనిటీ)నే అని చమత్కరించారు. బ్రాహ్మణుడినని చెప్పుకొన్న రాహుల్‌కు గాయత్రీ మంత్రం వచ్చా? సంధ్యావందనం చేస్తారా? అని రేవంత్‌ను ప్రశ్నించారు. కులగణన చేసిన కాంగ్రెస్ సర్కారు.. అన్ని కులాల వివరాలను ఎందుకు వెల్లడించడం లేదని నిలదీశారు. శుక్రవారమిక్కడి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మధ్య తలెత్తిన వివాదం సమసిపోతుందని చెప్పారు. అన్ని పార్టీల్లోనూ ఇలాంటివి సహజమన్న ఆయన.. తమ పార్టీలో ఇలాంటివి బహిరంగంగా జరిగి ఉండాల్సింది కాదని అభిప్రాయపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని రాంచందర్‌రావు సీఎం రేవంత్‌ను డిమాండ్ చేశారు.

# క్షయ వ్యాధి నిర్మూలన కొరకు ప్రతి ఒక్కరు సహకరించాలి

**టీబీ జబ్బును మందులతో తగ్గించవచ్చు, - క్షయ ను అశ్రద్ధ చేస్తే ప్రాణాలు తినేస్తది,**

**దీర్ఘకాలికంగా దగ్గు తెమడ వస్తుంటే పరీక్షలు చేయించుకోవాలి, - జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్**



**తొవ్వ న్యూస్ ప్రతినిధి కురవి జూలై 25,**
మహబూబాబాద్ జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లోని మొగిలిచర్ల గ్రామంలో ఇంటెన్సీ ఫైర్ టీబి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం కింద మొగిలిచర్ల గ్రామంలో వైద్య సిబ్బంది ఆశాలు, ఏఎన్ఎంలు, ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి ర్యాలీలో పాల్గొన్న అనంతరం మాట్లాడుతూ టీబి నిర్మూలన కొరకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. గ్రామాలలో ఆశాలు ఏఎన్ఎంలు ఇంటింటికి తిరుగుతూ షుగర్, బిపి, బరువు తక్కువ ఉన్నవారు, గతంలో టీబి జబ్బు వచ్చి ఉన్నవారు, మరల టీబి జబ్బు పరీక్ష చేయించుకునేందుకు వారిని మెప్పించాలని ఆయన అన్నారు. పిహెచ్సి వైద్యాధికారులు హెల్త్ సిబ్బంది ఏఎన్ఎంలు ఆశాలు అందరూ సమిష్టిగా పనిచేస్తేనే ఎలాంటి వ్యాధులైన పారద్రోల వచ్చని అన్నారు. క్షయ వ్యాధి తీవ్రమైన జబ్బే కానీ ఆరు మాసాలు మందులు వాడితే పూర్తిగా తగ్గిపోతుందని అన్నారు. బలమైన ఆహారం తీసుకుంటూ మందులు వాడాలని సూచించారు. జబ్బు లక్షణాలు ఉన్నవారు మందులు వాడకుండా అలానే ఉంటే కుటుంబ సభ్యుల్లో మరొకరికి కూడా క్షయ వ్యాధి వ్యాపించే అవకాశాలు ఉంటాయని అన్నారు. టీబి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి హాస్పిటల్ కు తీసుకువచ్చి తగిన పరీక్షలు చేసి వెంటనే మందులు ఇవ్వవలసిందిగా వైద్య సిబ్బందిని ఆదేశించారు. బిబి వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలె అవకాశం ఉంటుందని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో గ్రామపంచాయతీ సిబ్బందితో శానిటేషన్ చేపిస్తూ నిత్యం పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల టీబి వల్ల జబ్బు పట్ల జిల్లా మొత్తం పర్యవేక్షణ జరుగుతుందని వైద్య సిబ్బంది అందరూ కూడా అందుబాటులో ఉంటూ గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. జ్వరాలు వాంతులు విరోచనాలు ఉన్న గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యురాలు డాక్టర్ స్రవంతి. డాక్టర్ కరుణాకర్. హెల్త్ ఆఫీసర్ భద్రమ్మ. శోభ. ఏసు మణి. రాకేష్. హేమలత. అరుణ. చంద్రకుమార్. రమేష్. మానస. కృష్ణవేణి. పద్మ. పూరి. కవిత. తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ

**తొవ్వ న్యూస్ ప్రతినిధి కురవి**



**జూలై 25,**
వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయని వైద్య సిబ్బంది అలర్ట్ గా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. శుక్రవారం మండలంలోని బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టిక, ఓపి రిజిస్టర్, ఇన్ పేషంట్, అవుట పేషెంట్, రిజిస్టర్ లను క్షుణ్ణంగా పరిశీలించారు. బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సబ్ సెంటర్ల పరిధిలో ఉన్న గ్రామాల జనాభా షుగర్ బీపీ గుండె జబ్బులు, కిడ్నీ జబ్బులు, డయాలసిస్ పేషెంట్లు ఎంతమంది ఉన్నారు రిజిస్టర్ మెయింటెన్స్ చేయాలని అన్నారు. గత నాలుగు రోజుల నుంచి వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉంటుందని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. వారానికి రెండు మూడు గ్రామాలను ఎంపిక చేసుకొని మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో గర్భిణీ స్త్రీలను నెల నెల చెకప్ కు ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి పరీక్షించి మరల గర్భిణీ స్త్రీలను ఇంటి దగ్గరే దించే వెసులుబాటు చేయాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలను ఎక్కువగా అయ్యేటట్టు గర్భిణీ స్త్రీలను ప్రోత్సహించాలని తెలిపారు. వైద్య సిబ్బంది సమయపాలన తో పాటు పేషెంట్లను ఆప్యాయంగా చూడాలని అన్నారు. వైద్య సేవలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తపవని హెచ్చరించారు. ఆయన వెంట పిహెచ్సి వైద్యులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ కరుణాకర్, వైద్య సిబ్బంది తదిరులు ఉన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపరిచే బాధ్యత ఉపాధ్యాయులదే

**తాళ్లపూసపల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కోట కనకయ్య**



**తొవ్వ, కేసముద్రం, జూలై 25:**
విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపరిచే బాధ్యత ఉపాధ్యాయులదని తాళ్లపూస పల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కోట కనకయ్య అన్నారు. శుక్రవారం తాళ్లపూసపల్లి జడ్పీ హైస్కూల్ నందు కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కోట కనకయ్య మాట్లాడుతూ.. విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా గురువారం ఖమ్మంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన పద్ధతులు మెరుగ్గా ఉండాలని, పాఠశాల గోడలపై అవసరమైన చార్టులు అమర్చాలని, కిచెన్ షెడ్, కిచెన్ గార్డెన్, టాయిలెట్స్,వాటర్ టాప్స్ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. యుడైస్, ఎఫ్ఆర్ఎస్,అపార్, అడ్మిషన్స్ వివరాలు 100 శాతం అప్డేట్ చేయాలని, ఎండిఎం,స్టాక్,అటెండెన్స్, అడ్మిషన్ రిజిస్టర్లు అప్డేట్ చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు టీచర్స్ డైరీ మెయింటైన్ చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు అంకిత భావం, వృత్తినిబద్ధతతో పనిచేసి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని,చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కోట కనకయ్య ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఆర్పీలు వట్నాల సత్యనారాయణ, రామారావు పాఠశాలలో గ్రంథాలయ నిర్వహణ గురించి ఉపాధ్యాయులకు వివరిం చారు. ఈ సమావేశంలో రంగాపురం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరి గోపాల శ్రీధర్,బేరువాడ, అన్నారం ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానో పాధ్యాయులు బీరం జనార్ధన్ రెడ్డి, బత్తుల శ్రీధర్, సీఆర్పీ నేరెళ్ల పద్మ తోపాటు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పంది పంపు వాగు బ్రిడ్జి క్రింద
# చెత్త,కట్టెలు తొలగింపు

**-తహశీల్దార్ నాగరాజు**




**బయ్యారం,తోవ్వ,జులై 25.**
గత మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు పంది పంపుల వాగు,మసివాగులు ప్రమాద సూచికను దాటి ప్రవహిస్తూ ఉన్నాయి.పంది పంపుల వాగు అల్లిగూడెం వద్ద బ్రిడ్జి క్రింద చెత్తా చెదారం నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండటంతో వరద నీరు సమీప ప్రాంతం మొత్తం పోటెత్తి నీరు బ్రిడ్జి పై నుండి వెళ్ళుటను గమనించిన తాహశీల్దార్ నాగరాజు శుక్రవారం సంఘటన ప్రాంతాన్ని సందర్శించి జెసిబి యంత్ర సహాయంతో అడ్డుగా ఉన్న వాటిని తీసివేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు ప్రమాదకరంగా పొంగి ప్రవహిస్తున్నాయని, అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ బయటికి రావద్దని, చేపల వేటకు వాగుల వెంట వెళ్లకుండా తగు జాగ్రత్తలు పాటించాలని,విద్యుత్ స్తంబాల వద్ద తీగలను తాకవద్దని ప్రజలను కోరారు.

# సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**యాదాద్రి జిల్లా: వలిగొండ: తోవ్వ ప్రతినిధి: జులై 25**
భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా నాలుగో మహాసభలు వలిగొండ మండల కేంద్రంలో సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో ఈనెల 29వ తేదీన జరుగుతున్నది ఆ మహాసభలో ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎక్స్ ఎమ్మెల్యే పల్ల వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు పాల్గొంటారు, దేశంలో రాష్ట్రంలో పరిపాలిస్తున్న పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ఎన్నికల హామీలను అమలు చేయక రైతన్న సమస్యలు కార్మిక సమస్యలు పట్టించుకోకుండా కార్పొరేట్ శక్తుల కొమ్ముకాస్తున్నాయని ఆ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా సమస్యల పరిష్కారం గురించి ఈ మాసభలో చర్చించి తగు నిర్ణయం తీసుకోబడుతుంది ఆ మహాసభల కరపత్రం గురువారం వలిగొండ మండల కేంద్రంలో ఆవిష్కరించడమైనది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి , సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్ , మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి ,జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు ఎలగందుల అంజయ్య, మండల కార్యవర్గ సభ్యులు పోలేపాక యాదయ్య సలిబద్రి రవీందర్, అంబటి అంజయ్య, పులిపలుపుల మల్లేశం, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సుద్దాల సాయికుమార్, మచ్చ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రవ్వ అనసూర్య మరణం పార్టీకి తీరని లోటు

**మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి**



**యాదాద్రి జిల్లా:రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: జులై 25**
రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు రవ్వ అనసూర్య ఇటీవల గుండెపోటుతో మరణించారు. వారి దశదినకర్మకు మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రవ్వ అనసూర్య మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. వీరి వెంట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పున్న వెంకటేశం, కార్యదర్శి పిట్ట మహేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎడ్ల నరేందర్ రెడ్డి, ఇడేం శ్రీనివాస్, ఎడ్ల రామచంద్రారెడ్డి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొమ్మాయిగూడెం గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలి

**డివైఎఫ్ఐ**



**యాదాద్రి జిల్లా :రామన్నపేట: తోవ్వ ప్రతినిధి :జులై 25**
కొమ్మయిగూడెం గ్రామంలో నెలకొన్న మనిషినీటి సమస్య, కుక్కల బెడదను నివారించాలని డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శానకొండ రామచంద్రం అన్నారు. శుక్రవారం డివైఎఫ్ఐ కొమ్మాయిగూడెం గ్రామ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేసి, అనంతరం మాట్లాడుతూ గ్రామంలో నీటి ఎద్దడి నెలకొని ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వాధికారుల దృష్టి సాధించి నూతన బోర్ వేయించి గ్రామానికి మంచినీటిని అందించాలని, గ్రామంలో కుక్కల బెడద తీవ్రతరం కావడంతో పెద్దలు,చిన్నలు గాయాల పాలవుతున్నారని, గొర్రెలు,మేకలు,పశువులను గాయపరుస్తున్నాయని కుక్కల బెడదను నివారించడం కోసం చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ డివైఎఫ్ఐ గ్రామ అధ్యక్ష,కార్యదర్శులు జల్లెల మల్లేశం,ఆకిటి శ్రీను, కొండగడప చరణ్, గోలి ఉత్తేజ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం




**తొవ్వ,కేసముద్రం, జూలై 25:**
నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ జిల్లా నాయకులు, తాళ్లపూసపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేటి కొమురయ్య అన్నారు. మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో శుక్రవారం రేషన్‌కార్డు లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ సహకారంతో గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు లబ్ధిదారులకు అందజేయడమే తమ లక్ష్యమన్నారు. ఇప్పటికే గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని,వాటి నిర్మాణం జరుగుతుందన్నారు. అందరికీ మొదటి విడత బిల్లులు సైతం వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాచర్ల రాములు,రేషన్ డీలర్ గొర్రె వెంకన్న, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మునక మాకు మున్నేరు జలాలు మీకా

**-మున్నేరు జలాలు పాలేరుకు తరలింపు ఖమ్మం జిల్లా మంత్రుల జలదోపిడీకి పరాకాష్ట.**

**-సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మాజీ జెడ్పిటిసి గౌని ఐలయ్య.**



**బయ్యారం,తోవ్వ,జులై 25.**
-ఉమ్మడి వరంగల్,ఖమ్మం జిల్లాల అనేక వాగుల,ఉపనదుల సమాహారం మున్నేరు.పాకాల ఏరుకు వట్టేరు,బయ్యారం అలిగేరు కలిసి మున్నేరుగా మారిన చోట ముల్కనూరు సమీపంలో మున్నేరు ప్రాజెక్టు నిర్మిస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గార్ల,కామేపల్లి, కారేపల్లి ఖమ్మం రూరల్,అర్బన్ మండలాలతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని డోర్నకల్ మండలానికి సాగునీటితో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరుతాయి.35 రెవిన్యూ గ్రామాల ప్రజలు గత ఐదు దశాబ్దాలుగా ఈ ప్రాజెక్టు కోసం కలలు కంటున్నారు. ప్రారంభంలో చంద్రగిరి ప్రాజెక్టుగా,తర్వాత రెండేర్ల గడ్డ ప్రాజెక్టుగా,చివరకు మున్నేరు ప్రాజెక్టుగా పిలవబడుతున్న ఈ ప్రాజెక్టు అనేక దశాబ్దాల పాటు సర్వేల పేరుతో కాలయాపనకు గురైంది.చిట్ట చివరకు 2009 జూన్ 24వ తేదీన నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జీవో నెం:1076 ద్వారా131.67 కోట్లు ఈ ప్రాజెక్టును మంజూరు చేశారు.ఆరు మండలాల పరిధిలో 30,406 ఎకరాలకు సాగునీరు అందించటంతో పాటు బయ్యారం రక్షణ స్టీల్స్ కు అవసరమైన నీటిని కూడా సరఫరా చేసే లక్ష్యంతో ప్రతిపాదించబడిన ఈ ప్రాజెక్టు నిర్మాణమైతే తమ కల నెరవేరుతుందని ప్రజలు ఆశించారు.కానీ వైయస్ రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడంతో ఈ ప్రాజెక్టు మూలన పడింది. అటు తర్వాత ఈ ప్రాజెక్టు కోసం రిప్రజెంటేషన్లు, ఆందోళనలు కొనసాగినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిపై చేపట్టిన రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టుల క్రింద మున్నేరు ప్రతిపాదిత మేజర్ ఆయకట్టు సాగులోకి వస్తుందని ,అందువలన ఈ ప్రాజెక్టుకు అంత ప్రాధాన్యత లేదని పక్కన పెట్టేశారనీ, రాజీవ్ సాగర్,ఇందిరా సాగర్ పనులు నడుస్తున్న క్రమంలో తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడి,తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాజెక్టులను నిలిపివేసింది. ఇందిరా సాగర్,రాజీవ్ సాగర్ ప్రాజెక్టులను రీడిజైన్ చేసి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రూపొందించింది. 2016 ఫిబ్రవరి 16వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ టేకులపల్లి మండలం రోళ్ళపాడు చెరువులో సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంతో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రూపకల్పన చేయబడిందని ఆ సందర్భంగా కేసీఆర్ ప్రకటించారు.ఆనాడు విడుదల చేసిన డిపిఆర్ నివేదికలో ఫస్ట్ ఫేజ్ లోనే రోళ్ళపాడు,బయ్యారం,గార్ల చెరువులకు నీళ్లు అందిస్తామని పేర్కొన్నారు.కాని ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా 34 నెలల్లో పూర్తి చేస్తామన్న ప్రాజెక్టు10సంవత్సరాలుగా సాగుతూనే వుందనీ 14వేల కోట్ల అంచనా వ్యయం 20వేల కోట్లకు చేరి అందులో 10వేల కోట్లకు పైగా ఖర్చు అయినా కొత్తగా ఒక్క ఎకరానికి కూడా నీళ్ళివ్వలేదు.ప్రాజెక్టు లక్ష్యాన్ని నీరుగార్చి సీతారామ ప్రాజెక్టును కృష్ణా నది ఆయకట్టు స్థిరీకరణ ప్రాజెక్టుగా మార్చి వేశారు.ముఖ్యమంత్రి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన రోళ్ళపాడు,బయ్యారం,గార్ల చెరువులను డిజైన్ నుండి తొలగించి మొదటి ఫేజ్ పనులను పక్కనబెట్టి రెండవ ఫేజ్ పనులైన కృష్ణా ఆయకట్టు స్థిరీకరణ పనులను చేపట్టి పూర్తి చేసే దశకు చేరుకొన్నారు.దీని వలన భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల ఏజన్సీ రైతాంగానికి తీరని అన్యాయం జరిగిందనీ,దీనితో అటు మున్నేరు ప్రాజెక్టు రాక ఇటు సీతారామ ద్వారా నీరు వస్తాయనుకొన్న గోదావరి జలాలు చేజారిపోయిన స్థితిలో ప్రతిపాదిత మున్నేరు ప్రాజెక్టు ఆయకట్టు రైతులు నిరాశలోకి కూరుకుపోయారు. ఈ స్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హఠాత్తుగా మున్నేరు ప్రాజెక్టు నిర్మాణానికి 17-5-2025న 162.54 కోట్లు కేటాయిస్తూ జీవో నెంబర్ 98 విడుదల చేసింది.ఇందులో ఆంతర్యం ఏమిటంటే మున్నేరు ప్రాజెక్టు నీళ్లు సరాసరి పాలేరు జలాశయానికి పంపించడం కోసం మాత్రమే ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నట్లు ప్రకటించడం.మున్నేరు నుండి వృధాగా సముద్రంలో కలుస్తున్న పది టీఎంసీల నీటిని గ్రావిటీ కాల్వల ద్వారా సీతారామ ప్రాజెక్టు పాలేరు లింకు కెనాల్ కు అనుసంధానం చేసి 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరపబోతున్నట్టు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.ఈ ప్రాంత ప్రజల ఆశలపై నీళ్లు చల్లి,ఈ ప్రాంత భూములకు మున్నేరు నీరు చుక్క కూడా ఇవ్వకుండా, ఏనాడూ కనీస పరిశీలనలో లేని పాలేరుకు తీసుకుపోవటం విస్మయాన్ని కలిగిస్తుంది.పరివాహక ప్రాంత సమీప మండలాల అవసరాల కోసం ఐదు దశాబ్దాలుగా నలుగుతున్న ప్రాజెక్టు మున్నేరు ఇప్పటి వరకు జరిగిన ప్రతిపాదనలు, సర్వేలన్నీ ఈ ప్రాంత సాగునీటి అవసరాల కోసం జరిగినవే.ఇప్పటివరకు వున్న ప్రతిపాదనల ప్రకారం మున్నేరు ప్రాజెక్టు నిర్మాణం చేపడితే సీతారామ ప్రాజెక్టు కింద దగా పడిన ఆరు మండలాలకు సాగునీరు అందించవచ్చు.అలాగే ప్రాజెక్టు నుండి తక్కువ ఖర్చుతో లిఫ్ట్ ద్వారా ఆరు కిలోమీటర్ల దూరంలో వున్న బయ్యారం చెరువుకు నీళ్ళిస్తే ఆ చెరువు ద్వారా గార్ల చెరువుతో పాటు15 చిన్న చెరువులు,కుంటలకు నీళ్లు ఇవ్వవచ్చు.వందేళ్ల చరిత్ర కలిగిన పాలేరు చెరువు ఇప్పటికే నాగార్జునసాగర్ ద్వారా కృష్ణా జలాలతో అనుసంధానించబడి రిజర్వాయర్ గా మారింది.దాని క్రింద గల ఆయకట్టు స్థిరీకరణ కోసం ఆదివాసీ ప్రాంతానికి అన్యాయం చేస్తూ కృష్ణా బేసిన్ లో ఉన్న పాలేరుకు గోదావరి జలాలను సీతారామ ప్రాజెక్టు ద్వారా తీసుకెళ్తున్నారు.ఇప్పుడు అదనంగా మున్నేరు నీళ్ళను కూడా తరలించుకుపోవటం ఖమ్మం జిల్లా మంత్రుల జలదోపిడీకి పరాకాష్ట. తెలుగుదేశం,బిఆర్ఎస్ ప్రభుత్వాలలో క్యాబినెట్ మంత్రిగా పనిచేసి,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా మంత్రిగా కొనసాగుతున్న తుమ్మల నాగేశ్వరరావు గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు మళ్ళించి తన జన్మధన్యమైందని ప్రకటించుకొంటున్నాడు.రాష్ట్ర క్యాబినెట్ లో కీలక పాత్ర పోషిస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అవసరం లేకపోయినా,ఎవరూ అడగకపోయినా తన పాలేరు నియోజకవర్గ ప్రజల మెప్పు కోసం,జిల్లాలో తనదైన ముద్ర కోసం మున్నేరు జలాలను పాలేరుకు తరలించటానికి పూనుకొన్నాడు. కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడ బెరికిన చందంగా ఇరువురు మంత్రులు గోదావరి జలాలను ఏజెన్సీ ప్రాంతానికి రాకుండా చేయడమే కాక ఈ ప్రాంత అవసరాలు తీర్చాల్సిన మున్నేరు జలాలను కూడా వారి ప్రాంతాలకు తీసుకెళ్లడం పక్షపాతమే కాక అధికార దుర్వినియోగం కూడా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నీళ్లు, నిధులు, నియామకాలలో అన్యాయం జరుగుతుందని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ముందుకు వచ్చింది. ఇప్పుడు స్వరాష్ట్రంలో అధికారంలో ఉన్న వాళ్లు తమ ప్రాంత అభివృద్ధి కోసం వెనుకబడిన ఆదివాసీ ప్రాంతాల ప్రజల నోట్లో మట్టి కొడుతూ నీళ్లన్నీటిని తరలించకపోతున్నారు.ఇది క్షమించరాని నేరం.తలాపున ఉన్న నీటిని తమ సాగునీటి అవసరాలకు వాడుకోవడం ఆ ప్రాంత ప్రజల హక్కు. మున్నేరు జలాలు ముమ్మాటికి పరివాహక,పరిసర ప్రాంతాల ప్రజలవే.వారి అవసరాలు తీరిన తర్వాతనే మిగతా ప్రాంతాలకు వినియోగించుకోవాలి. మున్నేరు జలాల అక్రమ తరలింపుకు వ్యతిరేకంగా ఐక్య ఆందోళనకు పూనుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు 'మున్నేరు జల రక్షణ కమిటీ'గా ఏర్పడి ఆందోళనకు సిద్ధమవు తున్నాయి.ప్రజలు, ప్రజాస్వామికవాదులు వీరి న్యాయమైన పోరాటానికి మద్దతు పలకాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మాజీ జెడ్పిటిసి గౌని ఐలయ్య అన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలకు రేషన్ కార్డులు

**గత ప్రభుత్వం నిరుపేదలను పట్టించుకోలేదు - ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు సంక్షేమ ఫలాలు**

**లబ్ధి పొందిన పేదలు రేవంత్ రెడ్డి సర్కార్ కు అండగా నిలవాలి,**

**డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్**



**తొవ్వ న్యూస్ ప్రతినిధి కురవి (సీరోలు) జూలై 25,**
ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో పనిచేస్తున్నామని అన్నారు. శుక్రవారం సిరోలు మండలంలో ఉప్పరిగూడెం గ్రామంలో ఏర్పాటుచేసిన రేషన్ కార్డుల పంపిణీకి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని తరలివచ్చిన మహిళలకు రేషన్ కార్డులు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రేషన్ కార్డులు పంపిణీ జరుగుతుందని ప్రతి ఆడబిడ్డ పేరు మీద తెల్ల రేషన్ కార్డు ఇస్తున్నామని అన్నారు. ఆడబిడ్డల మొహంలో నవ్వు చూస్తే ఆకలి కూడా కావటం లేదని అన్నారు. ఎన్నో సంవత్సరాల నిరీక్షణ తర్వాత తెల్ల రేషన్ కార్డు కాంగ్రెస్ ప్రభుత్వంలో పంపిణీ జరుగుతుండటం చూసి టిఆర్ఎస్ నాయకులకు నోట మాట పడిపోయిందని అన్నారు. డోర్నకల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కంచుకోట లో గత నాలుగు దశాబ్దాల కాలంలో జరిగిన ఎన్నికల్లో రెండుసార్లు కాంగ్రెస్ చేజారిపోయిందని ఒకసారి టిడిపి, మరోసారి టిఆర్ఎస్ గెలిచిందని అన్నారు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో డోర్నకల్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారాలు అందిస్తున్నారని అన్నారు. మరో 30 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ డోర్నకల్ నియోజకవర్గంలో గెలుస్తుందని అన్నారు. ప్రతి పేదవానికి తెల్ల రేషన్ కార్డు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారునికి ఉచిత సన్నబియ్యం ఇచ్చి పేదవాని కడుపు నింపేందుకు లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. బేస్ మట్టం లెవెల్ కట్టుకున్న వాళ్ళకి మొదటి విడత బిల్లు లక్ష రూపాయలు వచ్చాయని అన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల నుంచి పేదలను పట్టించుకున్న పాపాన పోలేదని మండలానికి ఒకళ్ళని దగ్గర చేసుకుని దోచుకో దాచుకో అన్నట్లుగా దోచుకొని దాసుకున్నారని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో బియ్యం, బెల్లం, ఇసుక గంజాయి, అంబర్, గుట్కా, లాంటి రకరకాల అక్రమ వ్యాపారాలు చేసి కోట్ల రూపాయలు కూడా పెట్టుకున్నారని ఆయన అన్నారు. రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకోని వాళ్ళు ఇప్పుడు చేసుకోవచ్చని దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారుడికి తెల్ల రేషన్ కార్డు ఇస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పున్నం చందర్. ఎంపీడీవో గౌస్. మండల పార్టీ అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్ రెడ్డి. నియోజకవర్గ కన్వీనర్ కాలం రవీందర్ రెడ్డి. మండల పార్టీ ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు. గంద్ర సత్యం. తోట బిక్షమయ్య. మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహబూబ్ బాషా. గ్రామ పార్టీ అధ్యక్షుడు జెర్రిపోతుల మహేష్. జాటోతు లక్ష్మణ్ నాయక్. కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేసముద్రం

# దోస్తు ప్రత్యేక విడత ప్రవేశాలు



**తొవ్వ,కేసముద్రం, జూలై 25:**
కేసముద్రం ప్రభుత్వ కళాశాల డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ (దోస్త్) ప్రత్యేక ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.డి. రాజు తెలిపారు. శుక్రవారం నాడు అయన మాట్లాడుతూ ఈనెల 25 నుండి 31 వరకు కళాశాల లో రిజిస్ట్రేషన్ చేసుకుని బి.ఎ, బి. కామ్, బీ.ఎస్సీ కోర్సులలో ప్రవేశం పొందవచ్చని ఆయన అన్నారు. విద్యార్థులు ఈ చివరి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.వివరాలకు 7780701084, 7995911680 నంబర్లను సంప్రదించాలని తెపిపారు.

# న్యాయవాదులకు రక్షణ చట్టాల కోసం ఉద్యమిస్తాం

**లాయర్స్ ఫోరం సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి**



**తొవ్వ,జులై 25,ఇబ్రహీంపట్నం :**
లిరంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు లాయర్స్ పురం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అఖిలభారతీయ న్యాయవాద సంయుక్త ఆదిభక్త మంచ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ చట్టాలు ఏర్పడే వరకు లాయర్స్ పోరం మరియు అఖిల భారతీయ సంయుక్త న్యాయవాద అధివక్త మంచ్ అసోసియేషన్ నుంచి పోరాటాల నిర్వహిస్తామన్నారు రాబోయేటటువంటి బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఎన్నికల్లో మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు నాకు వేసి గెలిపించవలసిందిగా కోరుచున్నాము అన్నారు ఇబ్రహీంపట్నం కోర్టు బార్ అసోసియేషన్ సోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ మాట్లాడుతూ నర్రి స్వామి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూనే సామాజిక న్యాయం కోసం న్యాయవాదుల రక్షణ కోసం అనేక కార్యక్రమాలు చేయడం అభినందనీయం అన్నారు హాలో ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు యం. వెంకటేశం, జనరల్ సెక్రెటరీ ఆరిగే శ్రీనివాస్ ధనరాజ్, , పాండు, కోల మహేష్ ముదిరాజ్, అనేకమంది న్యాయవాదులు పాల్గొన్నారు

# చేనేత సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డికి వినతి



**తొవ్వ, జూలై 25, మునుగోడు:**
చేనేత సంఘాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు..ఉమ్మడి నల్గొండ మహబూబ్నగర్ జిల్లాలకు చెందిన సంఘాల నేతలు..శుక్రవారం హైదరాబాదులోని నివాసంలో రాజ్ గోపాల్ రెడ్డి నీ కలిసి పలు సమస్యలను విన్నవించారు..వాటిలో ముఖ్యంగా ప్రతి చేనేత మగ్గానికి ఉన్న జియో ట్యాగ్ అనుబంధ కార్మికులను మొత్తం ముగ్గురు ఉండేలా చూడాలని(గతంలో జియో ట్యాగ్ అనుబంధ కార్మికులు ముగ్గురు ఉండేవారు ప్రస్తుతం ఇద్దరికీ కుదించారు)...350 సంఘాలకు సంబంధించిన 50 కోట్ల రుణాలను మాఫీ చేసి కొత్తగా మళ్లీ రుణాలను మంజూరు చేయాలని, చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు.. తన రాజకీయ ప్రస్థానమే చేనేత సంఘాల సమస్యల పరిష్కారంతో మొదలైందని గుర్తు చేస్తూ..తప్పకుండా జియో టాగ్ అనుబంధ కార్మికుల పెంపు,రుణమాఫీ కొత్త రుణాల మంజూరు,చేనేత సంఘాలకు ఎన్నికల అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇ

# గ్రామ పంచాయతీలలో నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు



**తొవ్వ,గార్ల జూలై 25:** గార్ల మండల పరిధిలోని ఉన్నటువంటి గ్రామ పంచాయతీలలో కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్న చూస్తున్నామని బహుజన సమాజ్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ అధ్యక్షులు అజ్మీర వెంకన్న అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గార్ల మండలం పరిధిలో ఉన్నటువంటి ఆయా గ్రామ పంచాయతీలలో కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్నటువంటి సందర్భాలు చూస్తున్నామని,టైం కి ఆఫీసుకు రాక వాళ్ళ ఇష్టానుసారంగా రావడం వల్ల గ్రామాలలోని ప్రజలు వర్షాకాలం ప్రభవం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని ,సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సరియైన గ్రామాలలో వీధి దీపాలు లేనటువంటి సందర్భాలు కూడా చూస్తున్నామని కొద్దిరోజుల కురుస్తున్న వర్షాలకు మురికి గుంతలు ఏర్పడి దోమల బెడదల వల్ల వ్యాధులు సోకే అవకాశాలు ఉన్నాయని,వర్షాల వల్ల రోడ్లు దెబ్బతిని రాకపోకలు అంతర్యాయాన్ని కలిగిస్తున్నాయని వెంటనే ఏఎన్ ఎం, ఆశ వర్కర్లు అందుబాటులో ఉండి వారికి వైద్యం నిత్యఅందే విధంగా ఉండాలని సీజనల్ వ్యాధుల వల్ల ప్రజలు అనే ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. తక్షణమే ఈ విషయం అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేటట్లుగా చర్యలు తీసుకోవాలని, ఈ కార్యక్రమంలో అజ్మీర వెంకన్న, నరేష్,సురేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా బాదావత్ సురేష్ నాయక్



**తొవ్వ, నెల్లికుదురు, జూలై 25**
మండలంలోని పెద్దతండ (మేచరాజుపల్లి) గ్రామానికి చెందిన బాదావత్ సురేష్ నాయక్ ను బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు మండల ప్రాబరి మాజీ ఎంపీపీచెల్పూరి వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ పూర్తిస్థాయి మండల కమిటీని గురువారం ప్రకటించినట్లు తెలిపారు. అందులో యువకులకు సముచిత స్థానం కల్పించేక్రమంలోనే పార్టీలో చురుకైన కార్యకర్తగా యువమోర్చా మండల అధ్యక్షులుగా పార్టీకి చేసిన సేవలను గుర్తించి సురేష్ కుపార్టీలో సముచిత స్థానం కల్పించడం జరిగిందన్నారు అనంతరం నూతనంగా ఎన్నికైన సురేష్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చిన నేతలు కార్యకర్తలతో కలిసి విజయవంతం చేయడం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో నెల్లికుదురు మండల ప్రధాన కార్యదర్శిగా నా ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు వెంకన్న మండల ఇంచార్జ్ చెల్పూరి వెంకన్న మండల అధ్యక్షులు రాజ్ కుమార్, సీనియర్ నాయకులు పర్నే ప్రభాకర్ రెడ్డి, తో పాటు మండల నేతలకు కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

# ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు కాంగ్రెస్ నిరంతర పోరాటాలు

**కాంగ్రెస్ మండల నేత ఆకుతోట సతీష్ - ఏఐసీసీ ఆధ్వర్యంలో**

**“ఢిల్లీలో నిర్వహించినభాగిదారి న్యాయ సమ్మేళనం” లో పాల్గొన్న మండల బీసీ నేతలు**

**తొవ్వ నెల్లికుదురు, జూలై 25**
ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వం కల్పించే వరకు ఏ సి సి అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నిరంతరం పోరాటాలు చేస్తుందని మద్దతుగా బీసీలంతా భాగస్వాములు కావాలని కాంగ్రెస్ మండల నేత ఆకుతోట సతీష్ బీసీలను కోరారు. శుక్రవారం ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓబీసీ సమ్మేళనంకు మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక ఆదేశానుసారం ఢిల్లీకి తరలి వెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో,చట్టసభలలో, దేశ సంపదలో,ఇతర వెనుకబడిన తరగతుల (ఓ బి సి) భాగస్వామ్యం పెంచడం కుల ఆధారిత జనాభా గణన డిమాండ్‌ను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యంమని అన్నారు.రాహుల్ గాంధీ గారి పోరాటం వల్ల కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఏప్రిల్ 30, 2025న, రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భారతదేశంలో కుల గణన నిర్వహించాలనే ప్రతిపాదనను ఆమోదించిందని– భారతదేశానికి స్వాతంత్ర్యం తర్వాత ఇదే మొదటిసారి అని



అన్నారుఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని అన్నారుఈ కార్యక్రమంలో పిఏసిఎస్ డైరెక్టర్ రావుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్**



**తొవ్వ, నెల్లికుదురు, జూలై 25**
పేదల సొంతింటి కల నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీ రామగిరి గ్రామంలో ఇటీవలే ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి స్థానిక నేతలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి దశలో అర్హులైన పేదలకు గృహాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్ ల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామన్నారు. గ్రామంలో గృహాలు మంజూరు కానీ లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రెండవ విడతలో తప్పనిసరిగా లబ్ధి చేకూరుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో స్థానిక పిఏసిఎస్ డైరెక్టర్ మద్దెల సమ్మయ్య గౌడ్ , కాంగ్రెస్ గ్రామ శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, లబ్ధిదారులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన

**నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం - నర్సింహులపేట మీదుగా తొ ర్రూర్ బస్సు సర్వీస్ ప్రారంభం**

**మండల కేంద్రంలో మొబైల్ షాపు ప్రారంభం - ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్**



మహబూబాబాద్ జిల్లా నరసింహులపేట మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం. ఆర్టీసీ బస్సు మహబూబాబాద్ నుండి తొర్రూర్ వరకు బస్సును ప్రారంభించిన 1,43,00,000/- ఒకకోటి నలభై మూడు లక్షల రూపాయలతో నూతన పిహెచ్సి భవన నిర్మాణానికి శంకుస్థాపన, అనంతరం మహబూబాబాద్ నుండి నరసింహుల పేట మీదుగా తొర్రూర్ బస్సు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మండలంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ నందు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన లబ్ధిదారులు 980 నూతన రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామచంద్రనాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అనంతరం. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్ర నాయక్ ముఖ్య అతిథిగా హాజరై, అర్హులైన లబ్దిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,“తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, పేదల పక్షాన నిలుస్తూ వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది,” అని తెలిపారు. గతంలో %దీ=ూ% పార్టీ పాలనలో పేదల పట్ల తీవ్ర అన్యాయం జరిగిందని,10 సంవత్సరాలుగా ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. “పేదలు ఎన్నిసార్లు మొర పెట్టినా ప్రభుత్వం స్పందించలేదు. కానీ ఇప్పుడున్న ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేదల కష్టాలను గమనించి, వారికి సహాయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోంది,” అని పేర్కొన్నారు.పార్టీలకతీతంగా, కులాలకు అతీతంగా అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు.“ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రమేష్. మరి పేడబ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజశేఖర్. ప్రధాన కార్యదర్శి ఎరనాగి రమేష్. ఎస్టీ సెల్ అధ్యక్షులు ద్రసు నాయక్. గ్రామ పార్టీ అధ్యక్షులు రామకృష్ణ. మండల యూత్ అధ్యక్షులు శ్రీకాంత్. డోర్నకల్ యూత్ ప్రధాన కార్యదర్శి రేఖ అనిల్. సోషల్ మీడియా మండల అధ్యక్షులు సతీష్. నాయకులు తోట సురేష్. జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బ సోమిరెడ్డి. జిల్లా, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, మాజి ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక ఎమ్మార్వో రమేష్ బాబు. ఎంపీడీవో రాధిక. తో పాటు వివిధ శాఖల అధికారులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రెవిన్యూ సదస్సు దరఖాస్తుల అన్‌లైన్ వేగవంతం చేయాలి

**తహసీల్ధార్ కార్యాలయాన్ని సందర్శించి అడిషనల్ కలెక్టర్**

**సింగరేణి**
సింగరేణి తహసీల్దార్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం సందర్శించారు. భూభారతి రెవిన్యూ సదస్సులు సందర్భంగా వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ పక్రియను ఆయన పరిశీలించి సూచనలు చేశారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలన్నారు. దరఖాస్తులు సక్రమంగా లేకుంటే దానికి సంబంధించి దరఖాస్తుదారునికి నోటీస్ ఇచ్చి పూర్తి సమాచారాన్ని తీసుకున్న తర్వాత చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి దరఖాస్తుపై నియమనిబంధనలు అనుగుణంగానే చర్యలు ఉంటా యన్నారు.

# ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లవల్ల పంట పొలాలకు వెళ్లలేకపోతున్నాం

**బ్రాహ్మణ కొత్తపల్లి రైతులు**

**ఆకేరు శివారు పంట పొలాలకు వెళ్లే దారిపై నాట్లు వేసి వినూత్న రీతిలో నిరసన**



**తొవ్వ, నెల్లికుదురు, జూలై 25**
మండలంలోని బ్రాహ్మణ కొత్తపల్లి శివారు ఆకేరు వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల వల్ల రోడ్డు గుంతలమయంతో పాటు బురద అవడంతో శివారు పంట పొలాలకు వెళ్లే రైతులం నానా ఇబ్బందులు పడుతున్నామని గ్రామ రైతులు బొల్లు మురళి యాదవ్ బొల్లు రమేష్, తాళ్ల శ్రీపాల్ రెడ్డి తాళ్ల ఆది రెడ్డి, వెంకట్ రెడ్డి బొల్లు రాములు లు అన్నారు. శుక్రవారం రైతులు ఆకేరు కు వెళ్లే దారిలో రైతులు నాట్లు వేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక రవాణాను నిలిపివేయాలని పలుమార్లు మండల అధికారులకు విన్నవించిన ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక రవాణా ట్రాక్టర్ల వల్ల రోడ్డు పూర్తిగా ధ్వంసంమై పంట పొలాలకు నడిచి వెళ్ళలేని పరిస్థితి దాపురించిందన్నారు. తక్షణమే ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లను నిలిపివేసి దారిని మరమ్మతు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనట్లయితే రైతులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

# ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి

**మున్సిపల్ కమిషనర్ రాజలింగు**

**మందమర్రి జూలై 25**
ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 రోజుల కార్యాచరణ కార్యక్రమములో ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వివరాలను వెల్లడిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ట్రేడ్ లైసెన్సులు లేని ప్రతి ఒక్కరు లైసెన్సులు తీసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. వ్యాపార వాణిజ్య సముదాయములు నిర్వహణ ధారులు అందరూ కూడా వెంటనే మీ మీ షాపుల యొక్క ట్రేడ్ లైసెన్సులను జూలై 31 లోపు తీసుకోవాలని సూచించారు. లేని పక్షంలో ఆగస్టు 1 నుండి లైసెన్సులు తీసుకొని షాపులను తెలంగాణ పురపాలక చట్టం 2019 ప్రకారం సీజ్ చేస్తామని హెచ్చరించారు.

# మంథని మార్కెట్ కమిటి చైర్మన్‌గా కుడుదుల వెంకన్న

**జూలై - 25పెద్దపల్లి జిల్లా ప్రతినిధి :**
మంథని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ గా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుడుదుల వెంకన్నను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు శుక్రవారం జారీ చేసింది. మంథని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన కుడుదుల వెంకన్న మాజీ ఎం పి టి సి గా, మంత్రి శ్రీధర్ బాబుకు నమ్మిన బంటుగా ఉంటూ గత ఎన్నికల్లో మంత్రి శ్రీధర్ బాబు విజయంలో కుడుదల వెంకన్న కీలక పాత్ర పోషించారు. మండల కాంగ్రెస్ లో సంబరాలు చేసుకుంటున్నారు. వైస్ చైర్మన్ గా ముసుకుల ప్రశాంత్ రెడ్డి, డైరెక్టర్లుగా మంథని సదానందం, కన్నబోయిన ఓదెలు, ఎండి అంకుస్, రేగళ్ల రామ్మోహన్ రావు, ఉదరి శంకర్, గడ్డం పోచయ్య, అజ్మీర చందు నాయక్, పన్నాల ఓదెలు, దూలం సులోచన, లింగంపల్లి నర్సింగరావు, రావికంటి వెంకటేష్, ఎల్లంకి శంకర్ లింగం లు నియామకమైనట్లు ఉత్తర్వులు జారీ చేశారు. కుడుదుల వెంకన్న నియామకం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు.

# కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల తనిఖీ

**ప్రత్యేక అధికారి డిప్యూటీ తహసిల్దార్ కృష్ణ**



**భూపాలపల్లి జిల్లా జూలై 25**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్ర%శీ% లోని కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రత్యేక అధికారిగా మహదేవపూర్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ ను జిల్లా కలెక్టరు రాహూల్ శర్మ నియమించారు. అనంతరం ప్రత్యేక అధికారిగా డిటి కృష్ణ కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించి బాలికలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. పాఠశాల చుట్టూ పరహరి గోడ తక్షణమే నిర్మాణం చేయాలని తదితర అంశాల పైన జిల్లా కలెక్టర్ కు నివేదిక అందించడం జరిగిందని అన్నారు. కస్తూర్బా గాంధీ పిల్లలపై వారికి అందాల్సిన పౌష్టిక ఆహారంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందని చదువు విషయంలో ప్రత్యేక కార్యచరణ తీసుకొని ముందుకు వెళ్లడం జరుగుతుందని ఆయన అన్నారు.



## హీరోయిన్‌గా మారిన చైల్డ్ ఆర్టిస్ట్

సినీరంగంలోకి బాలనటీనటులుగా అడుగుపెట్టి అడియన్స్ హృదయాల్లో స్థానం సంపాదించుకున్న తారల గురించి చెప్పక్కర్లేదు. చిన్న వయసులోనే అద్భుతమైన నటనతో ప్రశంసలు అందుకున్నారు. అతి తక్కువ సమయంలోనే ఎన్నో చిత్రాల్లో నటించి మెప్పించారు. కానీ ఆ తర్వాత చదువుల కోసం సినిమాలకు దూరమై.. ఇప్పుడిప్పుడే రీఎంట్రీ ఇస్తున్నారు. ఒకప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో ఆమె చైల్డ్ ఆర్టిస్ట్. తెలుగు కంటే ఎక్కువగా తమిళ్ సినిమాల్లోనే నటించింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ సినిమాతో ఆమెకు మరింత గుర్తింపు వచ్చింది. ఆమె మరెవరో కాదు.. యువీనా పార్థవి. తమిళంలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. అలాగే కోలీవుడ్ స్టార్ హీరోస్ అందరి సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్టుగా మెరిసింది. అమాయకపు మాటలు, అల్లరి చేష్టలతో ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. చదువుల కోసం చాలా కాలం సినిమాలకు దూరంగా ఉన్న యువీనా.. ఇప్పుడిప్పుడే సినిమాల్లోకి రీఎంట్రీ ఇస్తుంది. ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్టుగా కనిపించిన ఈ అమ్మడు.. ఇప్పుడు కథానాయికగా వెండితెరపై సందడి చేస్తుంది. ప్రస్తుతం సోషల్ మీడి ోాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది యువీనా. రెగ్యులర్ గా గ్లామర్ ఫోటోస్, ట్రెడిషనల్ పిక్స్ షేర్ చేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ అమ్మడు క్రేజీ ఫోటోస్ చూసి షాకవుతున్నారు నెటిజన్స్. ఒకప్పుడు ఎంతో ముద్దుగా కనిపించిన ఈ అమ్మాయి.. ఇప్పుడు గ్లామర్ ఫోజులతో నెట్టింట అరాచకం సృష్టిస్తోందంటూ కామెంట్స్ చేస్తున్నారు. 2013లో ఇవాన్ ఏ కమల్ సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది యువీనా.



### ఎంత రెమ్యునరేషన్ ఇచ్చినా

## ఆ హీరోతో నటించను

దక్షిణాది చిత్రపరిశ్రమలో ఆమె స్టార్ హీరోయిన్. అత్యధిక పారితోషికం తీసుకునే సినీతారలలో ఆమె ఒకరు. నయనతార.. సౌత్ ఇండస్ట్రీని ఏలేసిన అమ్మడు. తెలుగు, తమిళం భాషలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. ప్రస్తుతం తన భర్త, పిల్లలతో ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తూనే మరోవైపు సినిమాల్లోనూ నటిస్తుంది. ఇదిలా ఉంటే.. నయనతార రూ.100 కోట్లు ఇచ్చిన ఓ హీరోతో నటించనని ముఖం మీదే చెప్పేసిందట. షారుఖ్ ఖాన్ నటించిన జవాన్ సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఈ సీనియర్ బ్యూటీ, ఆ సినిమాతో సూపర్ డూపర్ హిట్ సాధించింది. ఆ తర్వాత నయనతారకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం కేజీఎఫ్ స్టార్ యష్‌తో కలిసి టాక్సిక్ సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా కోసం పాన్ ఇండియా అభిమానులు ఎదురుచూస్తున్నారు. కానీ ఈ సినిమా షూటింగ్, వివరాలను చాలా గోప్యంగా ఉంచారు. ఈ చిత్రంలో లేడీ సూపర్ స్టార్ నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి నటిస్తున్నారని సమాచారం. మలయాళ గీతు మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నయనతార పాత్ర చాలా ముఖ్యమైనదని తెలుస్తోంది.



## నాలుగు పదుల వయస్సులో అందం తగ్గని ఖడ్గం హీరోయిన్

ఖడ్గం చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు అంత సులువుగా మరిచిపోలేరు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం రోజు ఈ సినిమా తప్పక ప్రసారం కావల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ ఈ చిత్రాన్ని తెరకెక్కించగా, ఇందులో హీరో శ్రీకాంత్, ప్రకాష్ రాజ్, రవితేజ, బ్రహ్మాజీ ప్రధాన పాత్రలు పోషించారు. ఇక కథానాయికలుగా సోనాలి బింద్రే, సంగీత నటించారు. ఇక చిత్రంలో ఓ భామ స్పెషల్ అట్రాక్షన్‌గా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆమె మరెవరో కాదు కిమ్ శర్మ. ముసుగు వెయ్యొద్దు మనసు మీద అంటూ వచ్చే పాటతో ఓ ఊపు ఊపేసిన ఈ చిన్నది తెలుగు అడియన్స్ హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంది. అయితే చాలా మంది తారలు కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడు సినీ పరిశ్రమ నుండి మెల్లగా తప్పుకుంటున్నారు. ఆ కోవలో కిమ్ శర్మ కూడా ఒకరు.ఖడ్గం చిత్రంలో శ్రీకాంత్ వెంటపడినఈ అమ్మాయి ఖడ్గం సినిమాలో వన్ ఆఫ్ ది బెస్ట్ రోల్ లో నటించింది. రామ్ చరణ్ నటించిన మగధీర చిత్రంలో కూడా ఈ భామ స్పెషల్ సాంగ్‌తో అదరగొట్టేసింది. అయితే ఎందుకో ఈ మధ్య తెలుగు సినిమాలలో కనిపించడం లేదు. బాలీవుడ్‌లో సెటిల్ అయిందని తెలుస్తుండగా, అక్కడ పలు సినిమాలతో పాటు స్పెషల్ సాంగ్స్ చేస్తుంది. కిమ్ శర్మ.. బీటౌన్ నటుడు హర్షవర్ధన్ రానాతో ప్రేమాయణం సాగించినట్టు అప్పట్లో జోరుగా ప్రచారం సాగింది. ఇద్దరు పలు మార్లు బయట జంటగా కనిపించారు. అయితే ఏం జరిగిందో ఏమో కాని ఈ ఇద్దరు విడిపోయారు. అయితే సినిమాలకి కాస్త దూరంగా ఉంటున్న కిమ్ శర్మ ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఆసక్తికర ఫొటోలు షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంటుంది.

## ప్రభాస్ సరసన నటించనున్న భాగ్యశ్రీ బోర్సే

పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ సినిమాల కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది కల్కి సినిమాతో బాక్సాఫీస్ వద్ద హిట్టు కొట్టాడు డార్లింగ్. ఈ ప్రాజెక్ట్ తర్వాత వరుసగా తన సినిమాలను కంప్లీట్ చేయాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే కొన్ని నెలలుగా వరుస సినిమాల చిత్రీకరణలతో బిజీగా ఉన్నాడు. ఇప్పటికే డైరెక్టర్ మారుతి తెరకెక్కిస్తోన్న రాజా సాబ్ చిత్రీకరణలో బిజీగా ఉన్నాడు. హారర్ కామెడీ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అలాగే డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో వస్తోన్న ప్రేమకథ చిత్రంలో కొత్త అమ్మాయి ఇమాన్వి కథానాయికగా నటిస్తుంది. ఇదిలా ఉంటే.. తర్వలోనే మరో ప్రాజెక్ట్ స్టార్ట్ చేయనున్నాడు. అసలు విషయానికి వస్తే.. సందీప్ రెడ్డి డైరెక్షన్లో స్పిరిట్ చిత్రంలో నటించనున్నాడు ప్రభాస్. అలాగే డైరెక్టర్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలోనూ ఓ ప్రాజెక్ట్ చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వీరిద్దరి కాంబోలో రాబోతున్న ఈ సినిమా డిఫరెంట్ గా ఉండనుందని సమాచారం. తాజాగా ఈ మూవీ గురించి ఓ క్రేజీ న్యూస్ చక్కర్లు కొడుతుంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో ప్రభాస్ సరసన మరో కొత్త హీరోయిన్ నటించనుందట. ఆమె మరెవరో కాదు.. భాగ్య శ్రీ బోర్సే.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# బీసీ గురుకులంలో విద్యార్థుల పై ఎలుక దాడి


## సైదాపూర్ బీసీ హాస్టళ్ల పై దారుణం

## గదిలో చొరబడి నలుగురిని కరిచిన ఎలుక

## అపరిశుభ్రత వల్లేనని ప్రిన్సిపాల్ వివరణ

తొవ్వ ప్రతినిది ,జులై 25:





తెలంగాణ ప్రభుత్వం గురుకులాలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ఓ పక్క కోట్లు ఖర్చు పెడుతూ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే మరోపక్క మాత్రం రాష్ట్రంలో గురుకులాల్లో పరిస్థితి దయనీయంగా తయారైంది. ఓ వైపు ఫుడ్ పాయిజన్ కేసులుమరోవైపు విష పురుగులు కాటు వేస్తుండడం గమనార్హం. తాజాగా ఓ గురుకులంలో విద్యార్థులు ఎలుక కాట్లకు గురికావడం ఆందో ళన కలిగిస్తుంది. ఈ ఘటన హుజురాబాద్ పట్ట ణంలోని (దొపూర్) మహాత్మ జ్యోతిరావు పూలె బీసీ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉదయం జరిగింది వివరాల్లోకి వెళితే ఓ గదిలో ఎలుక చొరబడి నలుగురు విద్యార్థులను కొరికింది. ఈ విషయం ఉదయం పాఠశాలకు వచ్చిన ప్రిన్సిపాల్కు విద్యార్థులు తెలియజేయడంతో వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. పాఠశాల ఆవ రణలో రైస్ మిల్లు ఉండడం వల్ల అపరిశుభ్ర వాతావరణంతో ఎలుకల తీవ్రత ఎక్కువైంది. ఈ క్రమంలో పాఠశాలలో ఎలుకలు తిరుగుతు న్నట్లు తెలుస్తుంది ఈ విషయమై ప్రిన్సిపాల్ రాణిని వివరణ కోరగా నలుగురు విద్యార్థులను ఎలుక కొరికిందని, వారికి చికిత్స చేయడంతో పాటు ఆ గదిలో ఉన్న అందరి విద్యార్థులకు చికిత్సలు చేయించామని తెలిపారు. ఎలుకల నివారణ కోసం బోన్లను, వలలను ఏర్పాటు చేశామని చుట్టుపక్కల చెత్తాచెదారం నిండి రైస్ మిల్లు ఉండటంతో ఎలుకలు వస్తున్నాయని ఆమె తెలిపారు. దీనిపై ఉన్నత అధికారులు

## కుల సర్వే ఎక్స్ రే కాదు... సీటీ స్కాన్ కూడా కాదు...

## ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే తప్పుల తడక

### 52 శాతమున్న బీసీల జనాభా 46 శాతానికి ఎలా తగ్గింది?

### దమ్ముంటే గ్రామ పంచాయతీల వారీగా కుల సర్వే వివరాలను బహిర్గతం చేయాలి


### రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిక, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సవాల్



తొవ్వ ప్రతినిధి ,జులై 25:

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కుల సర్వే తప్పుల తడకగా ఉందని, దాన్ని కాంగ్రెస్ పార్టీ సమాజపు ఎక్స్ రే గా అభివర్ణించడాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా తప్పుబట్టారు. "అది ఎక్స్ రే కాదు.... కనీసం సీటీ స్కాన్ కూడా కాదు" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ చెబుతున్న రేర్ డేటా నిజమైతే తక్షణమే దాన్ని బయటపెట్టాలని, గ్రామ పంచాయతీల వారీగా, కులాల వారీగా కుల సర్వే వివరాలను బహిర్గతం చేయాలని రాహుల్ గాంధీకి, సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత సవాలు విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నదని ధ్వజమెత్తారు. కుల సర్వే పారదర్శకంగా జరగలేదని, అందులో ఎన్నో లోపాలున్నాయని ఎండగట్టారు. 2014లో 52 శాతమున్న బీసీల జనాభా 2024కు వచ్చే సరికి 46 శాతానికి ఎలా తగ్గిందని ప్రశ్నించారు. దీన్ని బట్టే ప్రభుత్వం చేసిన కుల సర్వేకు విలువ లేదని తేలిపోయిందని స్పష్టం చేశారు. కాబట్టి గ్రామాల వారీగా వివరాలు బయటపెడితే దూద్ కా దూద్.. పానీ కా పానీ తేలిపోతుందని తెలిపారు.

# లైంగిక దాడి కేసులో 20 ఏండ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా కోర్టు తీర్పు




తొవ్వ ప్రతినిధి ఖమ్మం, జులై 25: ఖమ్మం జిల్లా పోలీస్ కోర్టు లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష రూ. 2 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది.వివరాల్లోకి వెళితే జిల్లాలోని కూసుమంచి మండలం ధర్మతండాలో చెందిన బానోతు రాములు (50), 2023 ఆగస్టులో ఇంట్లో ఒంటరిగా ఉన్న నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కూసుమంచి పోలీసులు రాములుపై కేసు నమోదు చేసి రిమాండ్కు పంపారు. అనంతరం విచారణ అనంతరం ఎన్కోర్ రిపోర్ట్ ను కోర్టులో దాఖలు చేశారు.తదుపరి విచారణలో నిందితుడిని దోషిగా తేల్చిన ఖమ్మం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష రూ. 2 లక్షల జరిమానా విధించింది బాలిక కుటుంబానికి రూ. 5 లక్షల నష్టపరిహారం అందించాలని ఆదేశించింది ఇప్పటికే ఖమ్మం జిల్లాలోని శిక్షాధీనుల వసతిగృహంలో నిందితుడు శిక్ష అనుభవిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

## ఐద్వా మండల అధ్యక్ష,కార్యదర్శులు గా మౌనిక,నాగ మణి లు ఏకగ్రీవంగా ఎన్నిక

తొవ్వ,గార్ల జూలై 25:



అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) మండల అధ్యక్ష,కార్యదర్శులుగా చింత మౌనిక,మల్లెల నాగమణి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అ సంఘం జిల్లా కార్యదర్శి గాడిపల్లి ప్రమీల శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. స్దానిక మంగపతిరావు భవనంలో ఇటీవల జరిగిన ఐద్వా మండల 8వ మహాసభలో వీరితో పాటు కోశాధికారి గా తాళ్లపల్లి రమా లతో పాటు 25 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం లో,రాష్ట్రం లో మహిళల పై రోజుకు రోజు హత్యలు, అత్యాచారాలు పెరుగుతున్నాయని,మహిళల హక్కుల రక్షణ చట్టాలను అమలు చేయాలని భవిష్యత్తులో ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ నెల 28వ తేదీన జిల్లా కేంద్రం లోని పెరుమాండ్ల జగన్నాథం భవనం లో జరిగే జిల్లా మహాసభ లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ ఎన్నికో జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవితా, జిల్లా నాయకులు అలవాల సత్యవతి, చాగంటి భాగ్యమ్మ తదితరులు ఉన్నారు

## ఏఎస్సై గా పదోన్నతి పొందిన రాంపెల్లి సదయ్య.



తొవ్వ,కేసముద్రం , జూలై 25:

కేసముద్రం పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న రాంపెల్లి సదయ్య ఏ ఎస్సై గా పదోన్నతి పొందారు. 1990 బ్యాచ్ కు చెందిన రాంపెల్లి సదయ్య ప్రస్తుతం కేసముద్రం పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. అసిస్టెంట్ సబ్ ఇన్ స్పెక్టర్(ఏ ఎస్ ఐ) గా పదోన్నతి పొందారు. ఈ మేరకు శుక్రవారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపి కొత్త పదవుల్లో మరింత నిబద్ధతతో, సమర్థతతో సేవలు అందించాలని, ప్రజల సమస్యలపై స్పందన, నైతిక విలువలు క్రమశిక్షణ వంటి అంశాల్లో ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రజలతో మమేకమయ్యే విధంగా పనిచేసుకుంటూ పోలీస్ శాఖ పై ప్రజల్లో నమ్మకాన్ని మరింతగా బలపరచాలని సేవలో నిష్ట ,నిజాయితీకి ప్రాధాన్యత ఇవ్వాలని ,శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు.

## కుల గణన డబ్బులు ఇప్పించండి సార్



తొవ్వ, నర్సింహులపేట, జులై. 25

మండలంలోని వివిధ గ్రామాలలో కులగణన చేపట్టిన ఉపాధ్యాయులకు నేటివరకు కులగణన చేపట్టిన డబ్బులు చెల్లించలేదని ఇప్పటికైనా మాకు మా డ్యూటీతో పాటు అదనంగా డ్యూటీ చేశామని తమ ఆవేదన వ్యక్తం చేస్తూ శుక్రవారం శ్రీ వేంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ కు పీ ఆర్ టి యూ మండల అధ్యక్షులు ఎర్ర పూర్ణ చందర్, కార్యదర్శి కొండ సంజీవ మరియు ఉపాధ్యాలు వినతిపత్రం అందజేశారు.

## పూసల తండాలో వైద్య శిబిరం



తొవ్వ, నరసింహులపేట. జులై 25

ప్రాథమిక ఆరోగ్య కేంద్రము వైద్యాధికారి డాక్టర్ కవిత ఆదేశాల మేరకు ముంగిమడుగు ఉప కేంద్రము పూసలు తండా నందు ఏర్పాటుచేసిన ఉచిత ఆరోగ్య వైద్య శిబిరమలో 46మందికి బిపి మరియు షుగర్ , ఒక్కరికి జ్వరము పరీక్షలు చేసి ఉచితముగా మందులు ఇవ్వడం జరిగినది. ఈ వర్షాకాలంలో వచ్చే వ్యాధులు తీసుకోవలసిన తాగే నీరు తినే ఆహార పదార్థాలు జాగ్రత్తలు వారంలో రెండు రోజులు మంగళవారము మరియు శుక్రవారము రోజు ఇంట్లో వాడుకునే నీరు నిల్వ చేసుకునే పాత్రలు శుభ్రం చేసి ఆరబెట్టాలని ఆరోగ్య సూపర్వైజర్ విద్య చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి మమత. హెల్త్ సూపర్వైజర్ సుజాత సిస్టర్ నాగలక్ష్మి ఆశా రసూల్ బి పాల్గొనడం జరిగినది..


## డెంగ్యూతో యువతి మృతి

## ఖమ్మం జిల్లాలో విషాదం.



తొవ్వ ప్రతినిధి ,ఖమ్మం జులై 25:

డెంగ్యూతో మృతిచెందిన ఘటన ఖమ్మం జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. తల్లాడ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీదేవి (32), యోగా ట్రైనర్గా పని చేస్తూ, ఇటీవల డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.ఆమె తల్లడ మండలంలో స్థితిమానం ఉన్న ఎస్సైఎస్ ఎరియాలో నివాసం ఉంటుంది. గత కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమెకు డెంగ్యూ పాజిటివ్ వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు.పరిస్థితి విషమంగా మారడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో ట్రీట్మెంట్ తీసుకుంటుండగా గురువారం మరణించింది. ఆమెకు గత మూడు రోజులుగా ప్లేట్లెట్ కౌంట్ 2.60 లక్షలకు తగ్గడంతో పరిస్థితి అత్యంత విషమంగా మారిందని వైద్యులు పేర్కొన్నారు.శ్రీదేవి మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు ఖమ్మం జిల్లా వైద్యశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.




## గిరిజన దర్బార్ లో సమర్పించిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలి:

## ఐటీడీఏ పీవో చిత్ర మిశ్ర ఐ.ఏ.ఎస్.

తొవ్వ ,కొత్తగూడ ,జులై 25:

గిరిజన దర్బార్ లో సమర్పించిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చిత్ర మిశ్ర ఐ.ఏ.ఎస్ అధికారులను ఆదేశించారు , శుక్రవారం కొత్తగూడ రైతు వేదిక సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో గిరిజనుల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించి న సమస్యలను త్వరిత గతిన పరిష్కారం చేయాలని సంబంధిత సెక్టార్ అధికారులకు సూచించారు వివిధ మండలాల నుండి వచ్చిన గిరిజనులు (12) దరఖాస్తులు పీవో కి అందించారు





ముస్మి గ్రామం కొత్తగూడా మండల్ మహబూబాబాద్ జిల్లా నుండి ముస్మి గ్రామపంచాయతీలో సిసి రోడ్డు మంజూరు బొత్సవానిగూడెం ప్రైమరీ స్కూల్ రీ ఓపెన్ చేయడానికి అనుమతి డైస్ కోడ్ కోరారు. . కొత్తగూడెం మండల్ గాంధీనగర్ గ్రామంలో గల భూమికి ఉన్నటువంటి ఆర్ ఓ ఎఫ్ ఆర్ 1 1 0 6 కంపార్ట్మెంట్ నెంబర్ కి ఆన్లైన్ నందు నమోదు చేయాలనీ విజ్ఞప్తి చేశారు. అటవీ హక్కు పత్రము అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 చట్టంలోని సెక్షన్ 4 (4) కింద ఈ హక్కు వారసత్వము కుటుంబ సభ్యుల మధ్య తగాదాలున్నందున బ్యూటిషన్ కు అంగీకరించవద్దని దరఖాస్తు చేసినారు.అర్వోఎఫర్ టైటిల్స్ కలిగి ఉన్న రైతులను సాగు చేయించుట గురించి దరఖాస్తు చేసినారు. హాలియా తండా చెన్నారావుపేట మండల్ వరంగల్ జిల్లా నుండి సీతానగర్ మహబూబాబాద్ జిల్లాకు డిప్టేషన్ చేయుటకు దరఖాస్తు చేసినారు. గోపాలపురం గ్రామం కొత్తగూడ మండల్ మహబూబాబాద్ జిల్లా నుండి గుంజేడు గ్రామపంచాయతీ పరిధిలోని చిట్యాల గడ్డ గ్రామంలో 86 మంది అటవీ హక్కుల పత్రాల కొరకు దరఖాస్తు చేయడం జరిగింది సర్వే కూడా జరిగింది 34 మందికే హక్కు పత్రాలు వచ్చినవి మిగతా వారికి రాలేదు దాని గురించి దరఖాస్తు చేసినారు.తాటి వారి వేంపల్లి గ్రామం కొత్తగూడ మండల్ మహబూబాబాద్ జిల్లా నుండి రైతు బందు ఇప్పించుతా గూర్చి దరఖాస్తు

చేసినారు.కొత్తగూడ గ్రామం కొత్తగూడ మండల్ మహబూబాబాద్ జిల్లా నుండి నా యొక్క భర్త మరణించడం వలన నా యొక్క భర్త ఉద్యోగం నాకు ఇప్పించుతా గూర్చి దరఖాస్తు చేసినారు.ఈ కార్యక్రమం లో సురేష్ బాబు (%జూా-ాణ%) .డాక్టర్.కె. క్రాంతి కుమార్ డిప్యూటీ డి. ఎం. హెచ్. వో ఎం. కొండల్ రావు జే. డి. ఎం,.డి. వెంకన్న డిప్యూటీ తహసీల్దార్, .ఎన్. నాగ భవాని తహసీల్దార్, వీర స్వామీ ఎం. పి. డి. వో నీలోఫర్ అజ్మి సి. డి. పి. వో ఎస్. రామ లక్ష్మి ఐ. సి. డి. ఎస్. సూపర్ వైజర్ సుస్మిత ఎ. ఇ. వో వి. సారంగా పానీ డిప్యూటీ డైరెక్టర్ అధికారులు ఆయ గ్రామాల ప్రజలు